క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై అవగాహన



సిరిపురంలో పట్టభద్రులకు దరఖాస్తులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురంలో ఆదివారం ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. పట్టభద్రులకు దరఖాస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఈ నెల 6 వరకూ గడువు ఉందన్నారు. గ్రామాల్లో ఓటరు నమోదుపై అవగాహన లేకపోవడంతో ఓటర్లు ఆసక్తి చూపడం లేదన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత వెలుగూరి హరేరామ్, తిబిరిశెట్టి వీరనాగశివ, భేరి శివ, కొమ్మ సుబ్రహ్మణ్యం, మల్లగుంట రాజేష్, సోము అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా సత్యనారాయణ



ఏలేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్తగా యర్రవరం గ్రామానికి చెందిన నీరుకొండ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆదివారం సత్యనారాయణ తెలిపారు. తనను కో ఆర్డినేటర్‌గా నియమించిన అధ్యక్షురాలు షర్మిల, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈయన గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారు.

అర్హులకు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

తుని రూరల్/తొండంగి: అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తుందని ఎమ్మెల్యే యనమల దివ్య పేర్కొన్నారు. తుని మండలం హెచ్.కొత్తూరు, తొండంగి మండంలం ఎ.కొత్తపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు ఆదివారం ఆమె గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఎంపీపీ బొప్పన రాము, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి నాగసోమరాజు పాల్గొన్నారు.

మలుపు.. ప్రమాదానికి పిలుపు



తుని-నర్సీపట్నం రోడ్డులోని గొంపకొండ మలుపులో ఏపుగా పెరిగిన తుప్పలు

కోటనందూరు: తుని-నర్సీపట్నం రోడ్డులో మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా భారీగా తుప్పలు పెరిగిపోయి చెట్లను తలపిస్తున్నాయి. మలుపుల్లో ఎత్తుగా ఎదిగిన తుప్పలతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుని నుంచి జిల్లా సరిహద్దు ఉప్పరగూడెం వరకూ రోడ్డుకు ఇరువైపులా భారీగా తుప్పలు పెరిగిపోయి ప్రమాదాలు జరుగుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎంపీడీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698

సిబ్బంది కొరత.. చదువుకు వెత

- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో దయనీయ పరిస్థితి
- టీచర్ సెలవు పెడితే బడి మూతే
- ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవితవ్యం
- పట్టించుకోని అధికారులు



నాగులకొండపై బురదకోట గిరిజన తండాలో ఏకోపాధ్యాయ గిరిజన ప్రాథమిక పాఠశాల

ప్రత్తిపాడు: గ్రామీణ, గిరిజన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షలా మారింది. ఏకోపాధ్యాయ పాఠశాలలే అందుకు నిదర్శనం. పాఠశాలలు తెరచి నాలుగు నెలలు పూర్తయినా అధికారులకు వాటిలో సమస్యలు పట్టడం లేదు. పాఠశాలల్లో ఒక్కరే టీచర్ ఉండటంతో అతనిపైనే పాఠశాల తెరవడం, మూయడం ఆధారపడుతోంది. ఉపాధ్యాయుడు సెలవు పెటితే స్కూల్ మూతపడుతోంది.

మండలంలో ఆరు ఏకోపాధ్యాయ పాఠశాలలు

ప్రత్తిపాడు మండలంలోని 27 ప్రాథమిక పాఠశాలలుండగా, వాటిలో ఆరు ఏకోపాధ్యాయ పాఠశాలలే. ఆయా పాఠశాలల్లో ఏదైనా అవసరం ఉండి టీచర్ సెలవు పెడితే బడిని మూసేయాల్సిందే. ఉపాధ్యాయ పోస్టులు సరిపడా మంజూరు కాకపోవడం వల్ల ఈ పరిస్థితి దాపురిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

గిరిజన గ్రామాల్లోనూ..

మండలంలోని ఏలూరు శివారు పి.జగన్నాథపురం, ప్రత్తిపాడు యానాదిపేట, పెదశంకర్లపూడి ప్రాథమిక పాఠశాలలు, ఉలిగోగులు, కొండపల్లి, కె.అచ్చింపేట గిరిజన ప్రాథమిక పాఠశాలలు ఒక్కొక్క ఉపాధ్యాయులతోనే నడుస్తున్నాయి. మరో విశేషమేమిటంటే గతంలో బవురువాక, వాకపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు స్థిరంగా ఉపాధ్యాయులే ఉండేవారు కాదు. ఒమ్మంగి ఉప్పరిపేట పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరిని వాకపల్లి, చింతలూరు పాఠశాల నుంచి ఒకరిని బవురువాక పాఠశాలకు డిప్యూటేషన్‌పై నియమించడంతో ఈ పాఠశాలలు మూతపడే స్థితినుంచి గట్టెక్కాయి. మైదాన ప్రాంతాల్లోని పాఠశాలల్లో పరిస్థితి ఇలా ఉంటే ఇక గిరిజన ప్రాథమిక పాఠశాలలైన వంతాడ, బురదకోట, బాపన్నదార, ఉలిగోగుల, కొండపల్లి, కె.అచ్చింపేట గిరిజన ప్రాథమిక పాఠశాలలు కూడా ఒకే ఉపాధ్యాయుడితో నడిచేవి. అప్పట్లో కె.అచ్చింపేట గిరిజన ప్రాథమిక పాఠశాలను ఎత్తివేసి తిరిగి తెరిచారు. వంతాడ, బురదకోట, బాపన్నధార గ్రామాల్లోని గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మదో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ల (సీఆర్టీ)ను నియమించింది. ఆ తర్వాత వారి సర్వీసులు రెగ్యులర్ అయ్యాయి.

వసతులు ఉన్నా..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో దాదాపు భవనాల వసతి ఉన్నా బోధనకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో అన్ని తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చుండబెట్టి పాఠాలు వల్లేవేస్తున్నారు. మండలంలోని నాగులకొండపై గల బురదకోట, బాపన్నదార తండాల్లోని గిరిజన ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతుల కోసం గతంలో ఐటీడీఏ భవనాలను నిర్మించింది.



ప్రత్తిపాడు యానాదిపేటలోని ఏకోపాధ్యాయ ఎంపీపీ పాఠశాల

శతావధానం చేయాలిందేనా

పెదశంకర్లపూడి పాఠశాలలో ఒకటి నుంచి రెండు తరగతులు, మిగిలిన ఉలిగోగుల, కొండపల్లి, కె.అచ్చింపేట గిరిజన ప్రాథమిక పాఠశాలలు, ప్రత్తిపాడులోని యానాదిపేట, పి.జగన్నాథపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు బోధన జరిగే ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులు శతావధానం చేయాల్సి వస్తోందని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. పరిపాలన, పాఠశాలల నిర్వాహణ, మధ్యాహ్న భోజనం తదితర రికార్డుల నిర్వాహణకే ఉపాధ్యాయుల సమయమంతా హెచ్చిస్తున్నారు. దీంతో విద్యా బోధనకు సమయం ఉంటడం లేదనే వాదనలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవు పెట్టాలంటే ముందుగా ఎంఈఓకు సమాచారం ఇవ్వాలి. ఆయన ఎవరినైనా డిప్యూటేషన్‌పై పంపాలి. ఒకవేళ డిప్యుటేషన్‌పై టీచర్ రాకపోతే పాఠశాల మూతపడాల్సిందే. ఫలితంగా విద్యార్థులు ఆ రోజంతా పాఠాలు కోల్పోతున్నారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో టీచర్లు లేరు



ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో టీచర్ల లేరు. దీంతో మా పిల్లల విద్యా ప్రగతి కుంటుపడుతోంది. ఒకప్పుడు 60 మందికి పైగా విద్యార్థులుండే యానాదిపేట పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– చెరుకూరి దుర్గ, విద్యార్థి తల్లి, యానాదిపేట, ప్రత్తిపాడు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం



విద్యా ప్రగతి కుంటుపడకుండా తొమ్మిది మంది టీచర్లను సర్దుబాటు చేశాం. పాఠశాలలు మూతపడే ప్రశక్తే లేదు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్ సెలవు పెడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

– వి.రాజబాబు, మండల విద్యాశాఖాధికారి, ప్రత్తిపాడు

సుందరం... సుమనోహరం



సూదికొండ అటవీ ప్రాంతంలో ఆకట్టుకున్న సూర్యోదయం

గోకవరం: ఏజెన్సీకి ముఖ ద్వారమైన గోకవరం మండలంలో దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ అటవీ ప్రాంతంలో కమనీయమైన సుందర దృశ్యాలు కనువిందు చేస్తాయి. వీటికి తోడు సూర్యోదయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆదివారం గోకవరం మండలంలోని సూదికొండ అటవీ ప్రాంతంలో సూర్యోదయం ఆకట్టుకుంది. వనంలోకి సూర్య కిరణాలు చొచ్చుకుపోతున్న తీరు పర్యాటకులను కట్టిపడేసింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బొర్రంపాలెం వద్ద ప్రమాద దృశ్యం

గండేపల్లి: జాతీయ రహదారిపై ఆదివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం ... విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న లారీని మండలంలోని బొర్రంపాలెం సబ్‌స్టేషన్ సమీపంలో వెనకే వస్తున్న కారు ఓవర్ టెక్ (తప్పించే క్రమంలో) చేసే క్రమంలో లారీ ముందుభాగాన్ని ఢీకొని లారీకి ఎదురుగా అడ్డం తిరిగి నిలిచింది. ఈ సంఘటనలో కారులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు.

పంటల బీమా నమోదు చేయించుకోవాలి



మరువాడలో జీడి తోటలను పరిశీలిస్తున్న హెచ్ఓ విజయలక్ష్మి

తుని రూరల్: జీడితోటల పంటల బీమా గడువు ఈ నెల 15వ తేదీ వరకూ ఉందని, అప్పటిలోగా రైతులు బీమా చేయించుకోవాలని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని మరువాడ, రేఖవానిపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. ఈ సంవత్సరం రైతులే జీడి తోటలకు బీమా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ప్రభావిత నష్టాలు సంభవించినప్పుడు నష్ట పరిహారం లభిస్తుందన్నారు. రుణాలు పొందే సమయంలో బ్యాంకులు బీమా ప్రీమియం మొత్తాన్ని మినహాయించుకుంటాయని తెలిపారు. రైతులు నేరుగా సహకార బ్యాంకు, గ్రామీణ బ్యాంకు, కమర్షియల్ బ్యాంకు, మీ సేవా కేంద్రాల్లో రూ.1500 చెల్లించి బీమా నమోదు చేయించుకోవచ్చన్నారు. బీమా నమోదుకు భూమి పత్రాలు, కౌలుకార్డు, ఫోన్ నంబరు, పంట సాగు చేస్తున్నట్టు వీఆర్వో నుంచి పత్రం, ఆధార్, బ్యాంకు అకౌంట్ నంబర్ ఉండాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన



చిన్నారులను అభినందిస్తున్న ఈఓ రామచంద్రమోహన్

అన్నవరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం రత్నగిరి కళావేదిక మీద చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో పాటు భక్తి గీతాలకు నృత్యం చేసి అందరి ప్రశంసలు పొందారు. నృత్యం చేసిన చిన్నారులను దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. నూతన కమిటీ సభ్యులుగా కంకిపాటి జమీలు, దాడిశెట్టి విష్ణుచక్రం, పోతుల రమేష్, కాళపు వెంకటరమణ, పెదపూడి ఈశ్వరరావు, మేగాదుల సత్యనారాయణ, పన్నీరు బాబ్జి, దండెం రామకృష్ణ, తూము రమణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేసింది. కార్యవర్గ సభ్యులను చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు నరిశే శివగణేష్, మాచాన్ ఎండీ వంగలపూడి సత్యనారాయణ, సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తిస్వామి, మాజీ అధ్యక్షుడు కోలా భీమేశ్వరరావు అభినందించారు.

కొత్తపల్లిలో దొంగలు హల్‌చల్

షాపులో చోరీ, వృద్ధుడిపై దాడి

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ షాపులో చోరీ చేయడమే కాకుండా ప్రశ్నించిన ఓ వృద్ధుడిని తీవ్రంగా గాయపరిచారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు గ్రామంలో లక్ష్మీ ఫుట్‌వేర్ షాపులో దొంగతనం చేశారు. ఆ సమయంలో షాపునకు సమీపంలో ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న దిండి బాబూరావు అనే వృద్ధుడు వారిని గుర్తించి ప్రశ్నించగా అతనిపై ఇద్దరు దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాబూరావును కుటుంబ సభ్యులు తొలుత గోకవరం ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామంలో చోరీలు పెరిగిపోయాయని, పోలీసులు స్పందించి గ్రామంలో చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

శివపూజకు వేళాయె..



గోకవరంలో రామలింగేశ్వరస్వామి ఆలయం



కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలంనాటి రాజలింగేశ్వరస్వామి ఆలయం

- నేడు కార్తిక సోమవారం పూజలు
- ముస్తాబైన శివాలయాలు
- కొత్తపల్లిలో 300 సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయం

తుని: పవిత్ర కార్తిక మాసం ప్రారంభమైంది. తొలి సోమవారం రోజున పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని కట్రాళ్లకొండ తాండవ ఉమా రామ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు మున్సిపల్ అధికారులు స్నానఘాట్‌ను ఏర్పాటు చేశారు. గవరపేట, పెద్దవీధి శివాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ప్రశాంతంగా ముక్కంటిని దర్శించుకునేందుకు క్యూలైన్లను ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి. భక్తులకు ట్రాఫిక్ సమస్య లేకుండా పట్టణ ప్రత్యేక చర్యలు తీసుకున్నామని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

జగ్గంపేట నియోజకవర్గంలో ప్రముఖ ఆలయాలు

గోకవరం: పవిత్ర కార్తిక మాసంలో మొదటి సోమవారం పూజలకు మెట్ట ప్రాంతమైన గోకవరం నియోజకవర్గంలో శివాలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాలకు భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గంలో గోకవరంలోని పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, ఉమాగోకర్ణేశ్వరస్వామి ఆలయం, కొత్తపల్లిలోని సుమారు 300 సంవత్సరాలు చరిత్ర కలిగిన రెడ్డిరాజుల కాలం నాటి రాజలింగేశ్వరస్వామి ఆలయం, తంటికొండలోని అఖిలాండేశ్వరి సమేత జంభుకేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధిగాంచినవి. గోకవరంలో ప్రధానరహదారికి ఆనుకుని ఉన్న రామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి వందల సంవత్సరాలకు పైబడి చరిత్ర ఉంది. ఈ ఆలయానికి తూర్పు ముఖంగా కోనేరు ఉంది. ఏటా కార్తికమాసంలో మహిళలు ఈ కోనేటిలో కార్తిక దీపాలు వదులుతారు. రమాసత్యనారాయణస్వామి ఆలయంలో కొలువై ఉన్న ఉమా సమేత గోకర్ణేశ్వర స్వామికి సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఆలయంలో కొలువైన స్వామివారి పేరుమీదే గ్రామానికి గోకవరం అనే పేరు వచ్చిందని భక్తుల నమ్మకం. మురళీనగర్‌లో బాలత్రిపుర సుందరీదేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయం సుందరంగా ముస్తాబైంది. కొత్తపల్లి గ్రామంలో సుమారు 300 సంవత్సరాల చరిత్ర ఉన్న శివాలయం ఉంది. రెడ్డిరాజుల కాలంలో ఈ శివాలయాన్ని నిర్మించినట్టు చరిత్ర ఆధారాలు చెబుతున్నాయి. ఇక్కడ స్వామిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో ఈ ఆలయానికి ఏటా కార్తిక మాసంలో వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఆలయానికి విశేష చరిత్ర ఉండటంతో దేవదాయ శాఖ అధికారులు ఆలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. తంటికొండలో ఉన్న అఖిలాండేశ్వరి సమేత జంభుకేశ్వరస్వామి, కృష్ణునిపాలెంలోని పార్వతి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంతో పాటు అచ్యుతాపురం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక సోమవారానికి ఏర్పాట్లు చేశారు. జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లోని శివాలయాలు కార్తిక సోమవారానికి సుందరంగా ముస్తాబయ్యాయి.

ఏర్పాట్లు పూర్తి

తొండంగి: కార్తికమాసంలో మొదటి సోమవారం కావడంతో మండలంలోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. తొండంగి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని రంగులు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. అలాగే ఒంటిమామిడి, అద్దరిపేట, పంపాదిపేట, పైడికొండ, శృంగవృక్షం, పి.ఇ.చిన్నాయపాలెం, బెండపూడి, ఎ.కొత్తపల్లి శివాలయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అధ్వానంగా ఏలేరు కాలువ గట్టు



ఏలేరు ప్రాజెక్టు ప్రధాన కాలువ గట్టుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు

ఏలేశ్వరం: వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఏలేరు ప్రాజెక్టు ప్రధాన కాలువ గట్టు అధ్వానంగా మారింది. ప్రాజెక్టు ప్రధాన కాలువ గట్టుపై తుప్పలు పెరిగిపోయాయి. దీనికి తోడు గట్టు బీటలు వారి పెద్దరంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో కాలువ గట్టుపై రాకపోకలు సాగించేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. ఈ గట్టు ద్వారానే దిగువ ప్రాంతంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. గట్టును ఆనుకుని పలు గ్రామాలతో పాటు పవర్ ప్రాజెక్టు ఉంది. ఈ గట్టుకు కనీస మరమ్మతులు చేయడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ప్రధాన గట్టు నిర్వహణపై అధికారులు ఉదాసీనంగా వ్యహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతు పనులు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



ఏలేరు కాలువ గట్టుపై ఏర్పడిన రంధ్రాలు

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన

తుని: పవిత్ర కార్తిక మాసం ప్రారంభం కావడంతో వనసమారాధనలు ఊపందుకున్నాయి. తుని, పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. పాయకరావుపేట జగతా కల్యాణ వేదిక సమీపంలోని కొబ్బరి తోటలో వన సమారాధన ఏర్పాటు చేశారు. ఆ సామాజిక వర్గానికి చెందిన వారు కుటుంబ సమేతంతో హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. పలు విభాగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులను అందజేసినట్టు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కిశోర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు ఎస్. లక్ష్మీనారాయణ రెడ్డి, పోగ్రాం చైర్మన్ కర్రి నారాయణరెడ్డి, కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి ఎం.వెంకటరెడ్డి, తుని, పాయకరావుపేటకు చెందిన రెడ్డి సంక్షేమ సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

రత్నగిరిపై ఫిర్యాదుల బాక్స్‌ల ఏర్పాటు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానంలో పలు చోట్ల ఫిర్యాదుల బాక్స్‌లు ఏర్పాటు చేశారు. సత్యదేవుని సన్నిధికి వచ్చే భక్తులు దేవస్థానంలో తమకు ఎదురైన అనుభవాలను పేపర్‌పై రాసి ఆ బాక్స్‌లో వేస్తే అధికారులు దానిని పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. అలాగే బాక్స్ మీద గల ఫోన్ నంబర్‌కు కాల్ చేసి కూడా ఫిర్యాదులు చెప్పవచ్చు. కేవలం ఫిర్యాదులే కాకుండా సలహాలు, సూచనలు కూడా చేయవచ్చని తెలిపారు.

పశ్చిమ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్



ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



సింహాద్రిపురంలో మంచానికే పరిమితమైన సత్యనారాయణను పరామర్శిస్తున్న సూర్యచంద్ర

కిర్లంపూడి: అనారోగ్యంతో మంచానికి పరిమితమైన రోగులకు రూ.15 వేల పింఛను ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు. మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన పీతల సత్యనారాయణ గతంలో కరెంట్ స్తంభం పైనుంచి పడిపోయాడు. తీవ్ర గాయాలై మంచానికే పరిమితం కావడంతో కుటుంబం గడవడం కష్టతరంగా మారింది. విషయం తెలుసుకున్న సూర్యచంద్ర ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 5 నెలలు గడుస్తున్న సత్యనారాయణకు పింఛను ఇవ్వకపోడం బాధకరమన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బాధితుడికి పింఛను ఇప్పించాలని కోరారు.